సాక్షి
ములుగు
మంగళవారం | 9 | మే | 2023



బాలుర అక్రమ రవాణా

ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో అక్రమంగా తరలిస్తున్న 25 మంది బాలురను అదుపులోకి తీసుకున్నట్లు వరంగల్ రైల్వే పోలీసులు తెలిపారు. - 8లో



మార్కెట్‌లో 'శ్రీకృష్ణ' లీలలు

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో పనిచేస్తున్న ఓ ఉద్యోగి మహిళా ఉద్యోగులపై వెకిలి పదజాలంతో వేధిస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
37.0°/27.0°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. రాత్రి సమయంలో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బతుకమ్మలతో నిరసన



ములుగు: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె సోమవారం 11వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ పక్కన బతుకమ్మలను పేర్చి ఆటలాడుతూ ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. రెగ్యులరైజ్ చేసేంత వరకూ పోరాడుతామని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన రవి సమ్మె స్థలి వద్దకు చేరుకుని వారికి మద్దతు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే జేపీఎస్‌ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

రామప్ప భూముల కౌలుకు వేలంపాట

వెంకటాపురం(ఎం): రామప్ప ఆలయానికి చెందిన సుమారు 15 ఎకరాల భూములలో వానాకాలం పంట సాగు చేసుకునేందుకు సోమవారం ఆలయ ఆవరణలో వేలం పాటలను నిర్వహించినట్లు ఆలయ ఈఓ బిల్లా శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రం శివారులోని 2.02 ఎకరాల భూమిని వేలంపాట నిర్వహించగా నల్లగుంట గ్రామానికి చెందిన బండారి సమ్మయ్య రూ.29,500 లకు వేలం పాట పాడినట్లు తెలిపారు. మిగిలిన భూములను కౌలుకు పట్టేందుకు ఎవరూ రైతులు ముందుకు రాలేదని ఈఓ తెలిపారు.

పంచాయతీ కార్యదర్శులు విధుల్లో చేరాలి

ఎస్ఎస్ తాడ్వాయి: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నేటి(మంగళవారం) సాయంత్రం కల్లా విధుల్లోకి చేరాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా నోటీసులు జారీ చేసినట్లు డీపీఓ వెంకయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఒప్పంద ప్రతిపాదికన పనిచేసే కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 28 నుంచి నిరవధిక సమ్మెకు దిగిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి స్పందించి సమ్మె విరమించి విధుల్లో చేరాలని నోటీసులు జారీ చేశారని వివరించారు. నేటి సాయంత్రం 5 గంటల కల్లా విధుల్లో చేరకపోతే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని నోటీసులో పేర్కొన్నట్లు సూచించారు.

పోక్సో కేసు నమోదు

ములుగు రూరల్: ఓ బాలికను నమ్మించి తీసుకెళ్లిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదైంది. ఈ సంఘటన మండల పరిధిలోని చింతలపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని పత్తిపల్లి పంచాయతీ పరిధి చింతపల్లికి చెందిన రాఘవేంద్ర ఓ బాలికను ప్రేమిస్తున్నానని మాయ మాటలు చెప్పాడు. ఏప్రిల్ 29వ తేదీన ఇంటి నుంచి తీసుకెళ్లాడు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

పనులు వేగవంతం చేయాలి

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియాలోని ఓపెన్‌కాస్టు ప్రాజెక్టులో మట్టి తొలగింపు పనులు వేగవంతం చేయాలని సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్) శ్రీనివాస్ ఆదేశించారు. ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రావు, అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ.. అన్ని గనుల ఉత్పత్తి, ఉత్పాదకత, రక్షణపై చర్చించారు. ఓపెన్‌కాస్టు ప్రాజెక్ట్ 2, 3లో నిర్దేశించిన మట్టి తొలగింపు లక్ష్యాలను చేరుకోవాలన్నారు. భూగర్భ గనుల్లో ఉత్పత్తి పెంచాలని, 10మెగావాట్ల సోలార్ ప్లాంట్‌కు సంబంధించిన సలహాలు ఇచ్చారు. ఓసీ-3లోని రెండవ మొబైల్ క్రషర్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని, రక్షణ చర్యలు పాటించాలన్నారు. ఈ సమావేశంలో అధికారులు స్వామినాయుడు, రామలింగం, వెంకటరావి ఎరెడ్డి, ఎన్వీ రావు, విశ్వనాథ్ పాల్గొన్నారు.

15నుంచి క్రీడాపోటీలు

భూపాలపల్లి అర్బన్: ఈ నెల 15నుంచి జిల్లాలో నిర్వహించనున్న చీఫ్ మినిస్టర్ కప్-2023 క్రీడాపోటీలను విజయవంతం చేయాలని డీవైఎస్ఓ సునీత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్విమ్మింగ్, బాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్ రెస్లింగ్, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్ పోటీలను 15నుంచి 36ఏళ్లలోపు మహిళలు, పురుషులకు నిర్వహించనున్నట్లు చెప్పారు. 15నుంచి 17వరకు మండల స్థాయి, 22నుంచి 24వరకు జిల్లాస్థాయి, 28నుంచి 31వరకు జిల్లాస్థాయిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 97050 36449, 83285 77652 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఓపెన్‌కాస్టుకు అడుగులు..!



భూమిలో బొగ్గు నిక్షేపాలను పరీక్షిస్తున్న సింగరేణి సిబ్బంది(ఫైల్)

పాలంపేట డెవలప్‌మెంట్ అథారిటీ కమిటీ తుది నిర్ణయం కోసం ఎదురుచూపులు

- గని ప్రారంభానికి అన్ని శాఖల నుంచి అనుమతులు..
- 20 ఏళ్ల పాటు 40 మిలియన్ టన్నుల బొగ్గు..
- వెలికితీసేందుకు సింగరేణి సంస్థ సన్నద్ధం



ఓపెన్‌కాస్టు గని ప్రాంతం మ్యాప్

వెంకటాపురం(ఎం): మండల కేంద్ర పరిధిలో పీవీ.నర్సింహారావు ఓపెన్‌కాస్టు గనిని ప్రారంభించేందుకు సింగరేణి సంస్థ సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఓపెన్‌కాస్టు గనితో రామప్ప ఆలయానికి ముప్పు వాటిల్లే అవకాశాలు ఉన్నాయని రామప్ప పరిరక్షణ కమిటీతో పాటు ప్రజాసంఘాలు ఆందోళన వ్యక్తం చేయడంతో కేంద్ర పురావస్తు శాఖ ఉన్నతాధికారులతో పాటు సింగరేణి సంస్థ ఉన్నతాధికారులు పలుమార్లు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. రామప్ప ఆలయానికి, ఓపెన్ కాస్టుగని ప్రారంభించే ప్రదేశానికి ఎంత దూరం ఉంది.. బ్లాస్టింగ్‌లు చేస్తే రామప్ప ఆలయం ఏమైనా వైబ్రేషన్‌కు గురవుతుందా అనే అంశాలపై జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) అధికారులు సైతం సర్వే నిర్వహించారు. సింగరేణి సంస్థ మైనింగ్, జియాలాజికల్, ఏఎస్ఐ శాఖల అనుమతితో పాటు పర్యావరణ అనుమతులు పొందినట్లు సమాచారం.

పాలంపేట డెవలప్‌మెంట్ కమిటీదే తుది నిర్ణయం

వెంకటాపురంలో చేపట్టే ఓపెన్‌కాస్టు గనిపై పాలంపేట డెవలప్‌మెంట్ అథారిటీ కమిటీ నుంచి అనుమతులు లభిస్తే గని పనులను వెంటనే ప్రారంభించేందుకు సింగరేణి అధికారులు సిద్ధమవుతున్నారు. ఓపెన్‌కాస్టు గనికి ఏరియల్ సర్వే ప్రకారం 5.8 కిలోమీటర్ల దూరంలో రామప్ప ఆలయం ఉందని సింగరేణి అధికారులు పలు శాఖలకు స్పష్టం చేశారు. ఓపెన్‌కాస్టు గని కోసం 30 మీటర్ల నుంచి 300 మీటర్లలోతు వరకు తవ్వకాలు జరపనున్నారు. ఇందుకోసం బ్లాస్టింగ్‌లు చేపడితే కిలోమీటరు వరకే వైబ్రేషన్స్ వచ్చే అవకాశాలు ఉంటాయని, సౌండ్ (ధ్వని) మాత్రం ఎక్కువగా వినపడే అవకాశాలు ఉంటాయని సింగరేణి అధికారులు పేర్కొంటున్నారు. అన్ని శాఖల నుంచి అనుమతులు తీసుకున్నట్లు పాలంపేట డెవలప్‌మెంట్ అథారిటీ కమిటీ నుంచి ఎన్ఓసి లభిస్తే వెంటనే పనులు ప్రారంభించేందుకు సింగరేణి సంస్థ సమయాత్తమవుతుంది.

బొగ్గు తవ్వకాలపై 18 ఏళ్లుగా నిరీక్షణ

వెంకటాపురం మండల కేంద్రం శివారులో నాణ్యమైన బొగ్గు ఉందనే నెపంతో 2005లో సింగరేణి సంస్థ 9,9ఏ ఇంక్‌లైన్ బావులను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకోసం బావుల వద్దకు వెళ్లేందుకు ప్రత్యేక రహదారి ఏర్పాటు చేసేందుకు భూమిని సైతం రైతుల నుంచి అధికారులు సేకరించారు. బావులు ప్రారంభించే సమయంలో నక్సల్స్ బెడద ఎక్కువ కావడంతో బావులను ప్రారంభించే ప్రక్రియను సింగరేణి వెనక్కి తీసుకుంది. తిరిగి 2020 నవంబర్‌లో బావుల స్థానంలో ఓపెన్‌కాస్టు గనిని ప్రారంభించేందుకు సింగరేణి సంస్థ శ్రీకారం చుట్టింది. భూ సేకరణ కోసం ఎంజాయ్‌మెంట్ సర్వే సైతం నిర్వహించింది. రైతుల భూములకు పరిహారం అందించే ప్రక్రియను ప్రారంభించే సమయంలో 2021 జూలై 25న రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు లభించింది. దీంతో ఓపెన్‌కాస్టు గనిని తాత్కాలికంగా నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేయడంతో పాటు పాలంపేట పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో పలు ప్రజాసంఘాలు ఆందోళనలకు పిలుపునివ్వడంతో ఓపెన్‌కాస్టు గనిని నిలిపివేశారు. ప్రస్తుతం తిరిగి ఓపెన్‌కాస్టు గనిని ప్రారంభించేందుకు సింగరేణి సంస్థ అన్ని శాఖల అనుమతి పొంది గని ద్వారా రామప్ప ఆలయానికి ఎలాంటి ముప్పు లేదని పాలంపేట డెవలప్‌మెంట్ కమిటీ ఇచ్చే ఎన్ఓసీ కోసం ఎదురుచూస్తుంది.



పురావస్తుశాఖ అధికారులతో పర్యటించి వివరాలు వెల్లడిస్తున్న సింగరేణి అధికారులు (ఫైల్)

40 మిలియన్ టన్నుల బొగ్గు వెలికితీత

పీవీ.నర్సింహారావు ఓపెన్‌కాస్టు గని ప్రారంభమైతే రాబోవు 20 ఏళ్లలో 40 మిలియన్ టన్నుల బొగ్గును వెలికితీయనున్నారు. ప్రతిఏటా 2.5 మిలియన్ టన్నుల నుంచి 3 మిలియన్ టన్నుల బొగ్గును వెలికితీయాలని సింగరేణి భావిస్తుంది. ఓపెన్‌కాస్టు గని కోసం 2,648 ఎకరాల భూమిని అధికారులు సేకరించనున్నారు. ఇందులో 1,164 ఎకరాల అటవీభూమి, 941 ఎకరాల్లో రైతులకు చెందిన పట్టా భూములు, 429 ఎకరాల్లో అసైన్‌మెంట్ భూమి, 114 ఎకరాల్లో రెవెన్యూ భూమి ఉంది. భూసేకరణ కోసం రూ.245.51 కోట్లను సింగరేణి సంస్థ ఖర్చు చేయనుంది. గని పనులు ప్రారంభమైతే సీఎస్ఆర్ నిధులు నుంచి ప్రతిఏటా 2 కోట్లు గ్రామాభివృద్ధికి కేటాయించడమే కాకుండా వెయ్యిమందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు సింగరేణి అధికారులు అనాధికారికంగా పేర్కొంటున్నారు.

వైభవంగా తెప్పోత్సవం

- లక్ష్మీనర్సింహస్వామి, అమ్మవార్లను పట్టు వస్త్రాలతో అలంకరణ
- ప్రత్యేక పల్లకిలో ఊరేగింపు



తెప్పోత్సవం నిర్వహిస్తున్న యాగ్నికులు

మంగపేట: మల్లూరు హేమాచల క్షేత్రంలో లక్ష్మీనర్సింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు తెప్పోత్సవం కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వాహణ అధికారి సత్యనారాయణ పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాల యాగ్నికులు వేద మంత్రోచ్ఛరణతో సోమవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో 8వ రోజు కార్యక్రమంలో భాగంగా భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఉప ప్రధానార్చకులు అమరవాది మురళీకృష్ణమాచార్యుల శిష్య బృందం ఉదయం ఆలయ సమీపంలోని ఎద్దు ముక్కు వద్ద గల ఆంజనేయస్వామికి పంచామృతాలతో అభిషేక కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు చతుస్థానార్చన, తెప్పోత్సవం, దోపోత్సవం, శ్రీ లక్ష్మీ సహస్రనామ స్తోత్ర పారాయణం వేద పండితులు నిర్వహించారు. తెప్పోత్సవం కార్యక్రమంలో భాగంగా లక్ష్మీనర్సింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పల్లకి(సేవ)పై ఉంచి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపం నుంచి దైత(వనదేవత) అమ్మవారి ప్రాంగణం వరకు డోలి సన్నాయి వాయిద్యాలతో తీసుకెళ్లారు. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నీటి హౌజ్‌లో రెండు గంటల పాటు తెప్పోత్సవం, ఆలయ ప్రాంగణంలో దోపోత్సవ కార్యక్రమాన్ని యాగ్నిక పూజారులు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారులు కైంకర్యం రాఘవాచార్యులు. ముక్కామల శేఖర్ శర్మ, కారంపుడి పవన్‌కుమార్, బ్రహ్మోత్సవాల యాగ్నికులు మధనమోహనాచార్యులు, పవనకుమార్, భాస్కరాచార్యులు, శ్రీరంగం వెంకటాచార్యులు. భరద్వాజాచార్యులు, రామాచార్యులు రాజీవ్ నాగశర్మ, ఏడునూతుల ఈశ్వర్‌చంద్ రామానుజం, ఆలయ సీనియర్ అసిస్టెంట్ సీతారాములు, సిబ్బంది శేషు, పుల్లయ్య, నూతుల కంటి అజయ్, గణేశ్ పాల్గొన్నారు.


రెండో ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రెండో ఏఎన్ఎంలు

ములుగు రూరల్: వైద్య ఆరోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్న రెండో ఏఎన్ఎంలను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట రెండో ఏఎన్ఎంలు సోమవారం ధర్నా చేపట్టారు. అనంతరం అదనపు కలెక్టర్ వైవీ.గణేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 5,544 మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ జీఓ నంబర్ 38ని విడుదల చేసిందన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో గత 15 నుంచి 20 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తున్న రెండో ఏఎన్ఎంలను వెంటనే పర్మినెంట్ చేయాలన్నారు. 11వ పీఆర్సీ ప్రకారం వేతనాలు చెల్లించాలని, ఏరియర్స్ ఇవ్వాలన్నారు. లేని పక్షంలో దశల వారీగా ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు సరోజన, కన్యాకుమారి, లలిత, సుజాత, ఆదిలక్ష్మి, సూర్యకుమారి, రాజ్యలక్ష్మి, శ్రీలత, నర్సమ్మ, తిరుమల, కవిత, సమ్మక్క, వెంకటరమణ, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



ఫిర్యాదుదారుల సమస్య వింటున్న అదనపు కలెక్టర్



వినతులు స్వీకరిస్తున్న పీఓ అంకిత్

ములుగు: ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ) వైవీ.గణేశ్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లాలోని 9మండలాల నుంచి 45 దరఖాస్తులు రాగా అందులో రెవెన్యూకు సంబంధించినవి 45, డబుల్ బెడ్ రూం ఇళ్లకు సంబంధించినవి మూడు దరఖాస్తులు రాగా మరో 26 పలు సమస్యలపై వచ్చాయి. వీటిని సమావేశానికి హాజరైన ఆయా శాఖల అధికారులకు రెఫర్ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గతంలో అందిన దరఖాస్తులు ఎక్కడా పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. ప్రతీ వారం శాఖల వారీగా దరఖాస్తులపై కింది స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రసూనారాణి, డీఎంహెచ్ఓ అప్పయ్య, డీపీఓ వెంకయ్య, సీపీఓ ప్రకాష్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజ్‌కుమార్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి గౌస్‌హైదర్, డీవైఎస్ఓ వెంకటరమణాచారి, డీవీహెచ్ఓ విజయ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి

ఏటూరునాగారం: గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విధంగా సెక్టార్ అధికారులు దృష్టి పెట్టాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. ఐటీడీఏలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో గిరిజనుల నుంచి వినతులను స్వీకరించారు. గిరిజనులు ఇచ్చిన 17 దరఖాస్తులను పరిశీలించారు. మంగపేట మండలం బండారిగూడెం/బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన సున్నం సోమమ్మ తన భర్త అనారోగ్యంతో చనిపోయాడని పట్టా భూమిని తన పేరుపై మార్చాలని కోరారు. కన్నాయిగూడెం మండలం చిట్యాలకు చెందిన యాలం బాబు రైతుబంధు మంజూరు చేయాలని పీఓను కోరారు. ఏటూరునాగారం మండలంలోని ముళ్లకట్టకు చెందిన తోలం కృష్ణయ్య గ్రామానికి విద్యుత్ స్తంభాలు ఇప్పించాలని దరఖాస్తు అందించారు. గోవిందరావుపేట మండలం బాలాజీ నగర్ సర్పంచ్ మౌనిక వినోద్ రోడ్డు మంజూరుకు దరఖాస్తు ఇచ్చారు. ఇలా పలు సమస్యలపై బాధితులు పీఓకు వినతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వసంతరావు, డీడీ పోచం, ఎస్ఓ రాజ్ కుమా ర్, ప్రాజెక్టు అగ్రికల్చర్ ఆఫీసర్ భారతి, జీసీసీ మేనేజర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

12న హనుమకొండకు సీఎం కేసీఆర్

కలెక్టర్లు, ఎమ్మెల్యేలతో సమావేశం



సాక్షిప్రతినిధి, వరంగల్: ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఈ నెల 12న హనుమకొండ జిల్లాలో పర్యటించనున్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించడంతోపాటు కొన్నింటిని క్షేత్రస్థాయిలో పరిశీలించే అవకాశం ఉందని సమాచారం. హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు, ఇతర శాఖల ఉన్నతాధికారులతో సీఎం సమావేశం కానున్నారు. ఉమ్మడి వరంగల్‌కు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలతో కూడా ఆయన సమావేశం అవుతారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు సిక్తా పట్నాయక్, పి.ప్రావీణ్యలకు సమాచారం అందినట్లు తెలిసింది. సీఎం పర్యటనకు మరో మూడు రోజుల గడువే ఉన్నందున ఇటీవల కురిసిన వర్షాల వల్ల పంటల నష్టంతోపాటు జిల్లాలకు చెందిన వివిధ పథకాల అమలు, ప్రగతిపై నివేదికల తయారీలో అధికారులు నిమగ్నమయ్యారు. కాగా జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలతో సమావేశం అనంతరం మడికొండలో రాష్ట్ర రైతు రుణ విమోచన కార్పొరేషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు కుమారుడి వివాహానికి హాజరై అక్కడినుంచి రోడ్డు మార్గాన హైదరాబాద్ పయనం అవుతారని పార్టీవర్గాల ద్వారా తెలిసింది.

ఆయన వస్తే లైన్ క్లియరైనట్లే!

కేటీఆర్ సభల కోసం 'సిట్టింగ్'ల ప్రయత్నాలు

- ఇటీవలి పర్యటనలలో బీఆర్ఎస్ అభ్యర్థుల ఖరారు
- క్లీన్‌అండ్‌క్లియర్‌గా ఉన్న స్థానాల్లో ప్రకటిస్తున్న కేటీఆర్
- ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో నలుగురు సిట్టింగ్‌లు ఖరారు
- కేటీఆర్ రాక కోసం ఎదురుచూస్తున్న మిగతా ఎమ్మెల్యేలు
- ఐదు స్థానాల్లో ఎటమటం, కేసీఆర్ నిర్ణయం పైనే నేతల భవిష్యత్



సాక్షిప్రతినిధి, వరంగల్: గులాబీ దళపతి సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ పథకాల రూపకల్పన, దేశరాజకీయాలపై బిజీగా ఉండగా ఆయన తనయుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వచ్చే ఎన్నికల్లో ఓట్లు.. సీట్లే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. మరో ఆరు మాసాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా.. అభ్యర్థుల ఖరారు, సిట్టింగ్ ఎమ్మెల్యేలకు భరోసా ఇచ్చే పనిలో పడ్డారు. ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో పర్యటించిన ఆయన సిట్టింగ్ ఎమ్మెల్యేల గెలుపు ఖాయమంటూ పరోక్షంగా అభ్యర్థులు వారేనన్న సంకేతాలు ఇచ్చారు. దీంతో కేటీఆర్ చుట్టే ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ పార్టీ రాజకీయాలు తిరుగుతున్నా యి. కేటీఆర్ నిర్ణయంతో ఇంకా సభలు నిర్వహించని 'సిట్టింగ్'ల్లో గుబులు నెలకొనగా.. టికెట్ ఆశిస్తున్న వారిలో ఆందోళన మొదలైంది.

రసకందాయంలో బీఆర్ఎస్ రాజకీయాలు..

ఉద్యమాల ఖిల్లా ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాలు రక్తికట్టిస్తున్నాయి. రాబోయే కాలానికి కాబోయే లీడర్ నేనేనని తిరిగే నాయకులకు దిమ్మతిరిగేలా షాక్ ఇస్తున్నారు సీఎం కేసీఆర్ తనయుడు కేటీఆర్. ఈ నెల 5న హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాదసభతో కేటీఆర్ ఎన్నికల శంఖారావం పూరించి అభ్యర్థులను ప్రకటించే పనిలో పడ్డారు. హుస్నాబాద్ అభ్యర్థిగా వొడితెల సతీష్ కుమార్‌ను, కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిగా వినోద్ కుమార్‌ను ప్రకటించిన కేటీఆర్, అదే రోజు గ్రేటర్ వరంగల్ పరిధిలో పర్యటించి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థిని డిక్లేర్ చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్‌ను వచ్చే ఎన్నికల్లో 75వేల పై చిలుకు ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో సిట్టింగ్‌లకే సీట్లని ఇటీవల జరిగిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో కేసీఆర్ ప్రకటించినప్పటికి అందులో 20 నుంచి 30 మందిని మార్చే అవకాశం ఉందని పార్టీ నేతలు భావిస్తున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ క్లీన్‌చిట్, క్లియర్‌గా ఉన్న నియోజకవర్గాల్లో పర్యటిస్తూ ముందస్తుగా అభ్యర్థులను ప్రకటిస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాలో పోటీ లేకుండా క్లీన్‌గా ఉన్న నాలుగు నియోజకవర్గాల అభ్యర్థులను ప్రకటించారు. పాలకుర్తి నుంచి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, వర్ధన్నపేటనుంచి అరూరి రమేష్, వరంగల్ పశ్చిమ నుంచి వినయ్‌భాస్కర్, భూపాలపల్లి నుంచి గండ్ర వెంకటరమణారెడ్డి పేర్లను ఖరారు చేశారు.


కేటీఆర్ సభల కోసం 'సిట్టింగ్'ల ప్రయత్నం.. ఐదింటిపై పెద్దసారుదే నిర్ణయ?


నియోజకవర్గాల వారీగా కేటీఆర్ పర్యటిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతోపాటు అభ్యర్థులను ప్రకటిస్తుండడంతో తమ తమ నియోజకవర్గానికి కేటీఆర్‌ను రప్పించుకుందుకు నేతలు పోటీ పడుతున్నట్లు స్పష్టమవుతోంది. కేటీఆర్ వస్తే అభివృద్ధి పనులకు నిధులు రాబట్టుకోవడంతోపాటు తమ భవిష్యత్‌కు బాటలు వేసుకునే అవకాశం ఉంటుందనే భావనతో నాయకులు ఉన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాలు ఉండగా అందులో ములుగు మినహా 11 నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. పదకొండులో ఇప్పటికే నలుగురు సిట్టింగ్‌లకు బెర్త్ ఖరారు చేసిన కేటీఆర్ మరో రెండు మూడు చోట్ల అభ్యర్థులను ప్రకటించే పనిలో ఉన్నట్లు ప్రచారం. బీఆర్ఎస్ 'సిట్టింగ్'లు ప్రాతినిధ్యం వహిస్తున్న ఐదు చోట్ల గ్రూప్ రాజకీయాలు, అంతర్గత కుమ్ములాటలతోపాటు ఆధిపత్యపోరు సాగుతోంది. ఎటమటం ఉన్న స్థానాల్లో అభ్యర్థుల ఖరారు చేసే బాధ్యత కేసీఆర్ చేతిలో ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వివాదాస్పదంగా మారిన ఆ ఐదు స్థానాలు ఇవే..

- స్టేషన్ ఘన్‌పూర్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య 'టికెట్ నాదే, గెలుపు నాదే'అంటుండగా.. ఎమ్మెల్సీ కడియం శ్రీహరి లేదా ఆయన కూతురు కావ్య టికెట్ ఆశిస్తున్నారు.
- వరంగల్ తూర్పులో సిట్టింగ్ ఎమ్మెల్యేగా నన్నపునేని నరేందర్ కొనసాగుతుండగా అక్కడి నుంచి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర బరిలో నిలిచేందుకు పోటీపడుతున్నారు.
- డోర్నకల్‌లో సీనియర్ ఎమ్మెల్యే రెడ్యా నాయక్ ఉండగా మంత్రి సత్యవతి రాథోడ్ టికెట్ ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.
- మహబూబాబాద్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యేగా శంకర్ నాయక్ ఉండగా అక్కడ ఎంపీ మాలోతు కవిత టికెట్ ఆశిస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు వారిమధ్య విబేధాలు బజారుకెక్కాయి.
- జనగామలో సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఉండగా, అక్కడినుంచి అవకాశం వస్తే పోటీ చేసేందుకు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి సిద్ధమవుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

తునికాకు సేకరణ ప్రారంభం





తునికాకు సేకరిస్తున్న మహిళలు

వాజేడు: మండల పరిదిలోని చీకుపల్లి, పేరూరు యూనిట్లలోని 43 తునికాకు కల్లాల్లో ఆకు సేకరణ పనులను సోమవారం మొదలు పెట్టారు. ఈ సందర్భంగా తునికాకు సేకరణపై అన్ని గ్రామాల్లో గిరిజన పద్ధతుల్లో అడవి తల్లికి పూజలు నిర్వహించారు. అనంతరం తునికాకు సేకరణ చేయాలని గ్రామ గ్రామాన దండోరా వేయించారు. దండోరా వేయడంతో ఇంటిల్లిపాది ఆకుల సేకరణ మొదలు పెట్టారు. 50 ఆకుల తునికాకు కట్టకు రూ.3 ధర నిర్ణయించారు.

క్లుప్తంగా

ఉచిత శిక్షణ తరగతులకు దరఖాస్తు చేసుకోవాలి

హసన్‌పర్తి: డిగ్రీ విద్యార్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగ యువతకు వివిధ పోటీ పరీక్షల కోసం ఐదు నెలల పాటు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేశ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల14లోపు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల నిరుద్యోగ యువత www.tsstudycircle.co.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రూ.3 లక్షల్లోపు ఆదాయం ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. అభ్యర్థులకు ఈనెల 21న ఆదివారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఉదయం 11 గటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత సాధించిన వారికి జూన్ 1 నుంచి అక్టోబర్ 31 వరకు వడ్డెపల్లి ఆర్టీసీ కాలనీలోని స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని రమేశ్‌కుమార్ కోరారు.

ఉరివేసుకుని తాపీమేస్త్రీ ఆత్మహత్య

వాజేడు: మండల పరిధిలోని పేరూరు గ్రామానికి చెందిన పెళ్లకూరి సత్యనారాయణ(27) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై రుద్రారపు హరీష్ కథనం ప్రకారం.. పేరూరుకు చెందిన సత్యనారాయణ తాపీమేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసై నెల రోజులుగా భార్యా పిల్లలను కొడుతూ వేధిస్తున్నాడు. సోమవారం మద్యం మత్తులో భార్య, అతని తమ్ముళ్లతో ఘర్షణ పడ్డాడు. ఈ క్రమంలోనే ఇంట్లో పైకప్పుకు ఉన్న గొట్టానికి చీరెతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తమ్ముడు సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పలువురికి గాయాలు

ఎస్‌ఎస్ తాడ్వాయి : మండలంలోని పంబాపూర్‌లో సోమవారం తేనెటీగల దాడిలో పలువురు గాయపడ్డారు. గ్రామంలోని క్రిమిటోరీల్ షెడ్ సమీపంలోకి వెళ్లిన గ్రామస్తులపై తేనెటీగలు దాడి చేయడంతో పది మంది గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన నలుగురికి తాడ్వాయి పీహెచ్‌సీలో డాక్టర్ ఆడెపు చిరంజీవి వైద్య చికిత్స అందించారు. చికిత్స పొందుతున్న వారిని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి పరామర్శించారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దండుల మల్లయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు బంగారి సాంబయ్య, సర్పంచ్ జాజ చంద్రం, మాజీ మండల అధ్యక్షుడు నూశెట్టి రమేష్, నాగేష్‌లు ఉన్నారు.

‘తొలిమెట్టు’ నోడల్ ఆఫీసర్లకే పర్యవేక్షణ బాధ్యతలు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలోని అన్ని పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమం అమలును చూస్తున్న మండల నోడల్ ఆఫీసర్లకే ఆయా మండలాల మన ఊరు - మనబడి పనుల పురోగతిని పర్యవేక్షించేలా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం డీఈఓ ఎండీ అబ్దుల్‌హై ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెల 4న విద్యాశాఖ డైరెక్టర్ శ్రీదేవసేన జిల్లా విద్యాశాఖాధికారుల వీడియో కాన్ఫరెన్స్‌లో ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా తొలిమెట్టు నోడల్ ఆఫీసర్లకు అదనపు బాధ్యతలు అప్పగించారు. జిల్లాలో మొదటి దశలో 176 పాఠశాలల్లో మన ఊరు మనబడి పథకం కింద ఎంపికై కొన్ని పాఠశాలల్లోనే పనులు పూర్తికాగా ఎక్కువ శాతం వివిధ దశలల్లో కొనసాగుతున్నాయి. వేసవి సెలవులు కావడంతో.. తొలిమెట్టు కార్యక్రమం లేనందున వీరంతా ఇక మన ఊరు మనబడి పనుల పురోగతిపై దృష్టి సారించనున్నారు.



వరంగల్ మార్కెట్‌లో శ్రీ‘కృష్ణ’ లీలలు

సస్పెండైనా కీలక విభాగంలో పోస్టింగ్
- అదనంగా మిర్చి సెక్షన్ అప్పగింత
- కింది స్థాయి సిబ్బందిపై వేధింపులు


వరంగల్ మార్కెట్ పరిపాలనా భవనం

వరంగల్ : వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో పనిచేస్తున్న ఉద్యోగి తన శ్రీ‘కృష్ణ’ లీలలతో మహిళా ఉద్యోగులపై వెకిలి పదజాలం ఉపయోగిస్తూ కిందిస్థాయి సిబ్బందిని వేధిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. సదరు ఉద్యోగి గత ఏడాది పత్తి సెక్షన్‌లో అవతకవకలకు పాల్పడి భారీగా మార్కెట్ ఆదాయానికి గండి కొట్టడంతో సస్పెండ్ చేశారు. ఒక మార్కెట్‌లో సస్పెండ్ అయిన ఉద్యోగికి వేరే మార్కెట్‌లో పోస్టింగ్ ఇస్తారు. కానీ ఇక్కడే సస్పెండ్ అయి ఇక్కడే పోస్టింగ్ పొందడం పలువురిని విస్మయానికి గురిచేసింది. సస్పెండ్ అయినా ప్రాధాన్యత ఉన్న ఓ సెక్షన్‌లో విధులు నిర్వహించడం విశేషం. అక్కడ విధులు నిర్వహిస్తూనే ఉన్నతాధికారి ఆశీస్సులతో ఈ ఏడాది మిర్చి సెక్షన్‌లో బాధ్యతలను అదనంగా చేపట్టాడు. అప్పటినుంచి మళ్లీ తన లీలలు యథావిధిగా కొనసాగుతున్నట్లు వినిపిస్తోంది.

ఆరోపణలు ఉన్నా కీలక సెక్షన్‌లు...

పత్తి యార్డులో విధులు నిర్వహిస్తూ అవకతవకలకు పాల్పడి సస్పెన్షన్‌కు గురైన సూపర్‌వైజర్‌కు మార్కెట్‌లోనే కీలకమైన ఎస్టాబ్లిష్‌మెంటు సెక్షన్ అప్పగించడంతో పాటు తాజాగా మిర్చి సెక్షన్ కూడా అప్పగించడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఉద్యోగి ఉమ్మడి జిల్లాలోని ఒక మార్కెట్‌లో పనిచేస్తున్న సమయంలో అక్కడి ఒక ఉద్యోగికి సంబంధించిన సర్వీస్ పుస్తకం మాయమైంది. బదిలీపై వరంగల్ మార్కెట్‌కు వచ్చినప్పటికీ ఈ విషయంపై జరిగిన విచారణలో ఇతనే బాధ్యుడిగా తేలినప్పటికీ అప్పటి మార్కెట్ అధికారి కేవలం మెమో జారీచేసి చేతులు దులుపుకున్నారు. బదిలీపై వచ్చిన ఉద్యోగి మార్కెట్‌లో జాయిన్ కాకపోయినా హాజరు పట్టికలో పేరు రాసి అటెండెన్స్ వేయడం దుమారం రేపింది. ఈవిషయంపై జరిగిన విచారణలో తప్పుకు తనదే బాధ్యత అని సదరు ఉద్యోగి లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇటీవల ఒక మహిళా ఉద్యోగిపై అసభ్యంగా మాట్లాడడంతో ఆమె తీవ్రంగా మానసికంగా బాధకు గురైంది. ఈ విషయంపై క్షమాపణలు చెప్పినట్లు తెలిసింది. అదేవిధంగా సెక్షన్‌లో ఉద్యోగుల హాజరు విషయంలో కిందిస్థాయి సిబ్బందిపై వేధింపులకు పాల్పడుతున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇతనిపై చర్యలు తీసుకునే అధికారం రాష్ట్ర మార్కెటింగ్ అధికారులకు నివేదికలు అందుతున్నా... వారు పెద్దగా దృష్టిపెట్టడం లేదని సమాచారం.

కాటన్‌లో చేతివాటం...

గత ఏడాది పత్తి సెక్షన్‌లో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తించిన సదరు ఉద్యోగి కొంత మంది చిల్లర వ్యాపారులు, అడ్తి వ్యాపారులతో కలిసి మార్కెట్‌లో జీరో దందాకు తెరలేపారు. మార్కెట్ యార్డులో జరిగే కొనుగోళ్ల సమయంలో పత్తి బస్తాలను తూకం వివరాలు దడవాయిలు రాసే చిట్టా పుస్తకాలను పరిగణలోకి తీసుకోకుండా నేరుగా బయటకు పంపడంతో మార్కెట్ అధికారుల కనుసన్నల్లోనే జీరో దందా జరుగుతోందని కొంత మంది ఖరీదుదారులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. చిట్టా పుస్తకాలు కార్యాలయంలోని పలు ప్రాంతాల్లో బయటపడడంతో విధులు నిర్వహిస్తున్న సూపర్‌వైజర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. అనంతరం జరిగిన విచారణలో సూపర్‌వైజర్‌తోపాటు కొంత మంది అడ్తిదారులు, ఖరీదుదారులు, దడవాయిలు భాగస్వాములుగా ఉన్నారన్నారు. ఒకేరోజు రెండు వేల బస్తాలు జీరో జరగడంపై సుమారు రూ.45 లక్షల వరకు ఆదాయానికి గండి పడిందని నివేదికను మార్కెట్ కమిటీకి అందించారు. అయినప్పటికీ మార్కెట్ కమిటీ వారందరిపై కాకుండా కేవలం సూపర్‌వైజర్‌పై సస్పెన్షన్ వేటు వేసి చేతులు దులుపుకున్నారు.

వయో వృద్ధులు వినియోగించుకోవాలి


వయోవృద్ధుల పోర్టల్‌ను ప్రారంభిస్తున్న సంక్షేమ అధికారి శారద, ఆర్డీఓలు

కరీమాబాద్: వయోవృద్ధుల సంక్షేమానికి ఏర్పాటు చేసిన ‘తెలంగాణ సీనియర్ సిటిజన్స్ మెయింటెనెన్స్ కేసెస్ అండ్ మానిటరింగ్ సిస్టం(టీఎస్‌సీఎంఎంఎస్) పోర్టల్‌ను వినియోగించుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి ఎం.శారద అన్నారు. ప్రభుత్వం రూపొందించిన పోర్టల్‌ను సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా శారద మాట్లాడుతూ.. వయోవృద్ధులు తమకు కావాల్సిన పోషణ భృతి కోసం ఎక్కడి నుంచైనా ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక వెబ్ సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వృయోవృద్ధులను వేధించినా, హింసించినా, నిరాధరణకు గురి చేసినా హెల్ప్‌లైన్ నంబర్ 14567ను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వరంగల్, నర్సంపేట ఆర్డీఓలు మహేందర్ జీ, శ్రీనివాసులు, ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి అనిరుధ్ యాదవ్ పాల్గొన్నారు.

అప్రమత్తతే అన్ని విధాలా మేలు


పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు,వెండి వస్తువులను చూపుతున్న ఏఎస్పీ

- అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య

గూడూరు: ప్రతీ ఒక్క కుటుంబం అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటిస్తే అన్ని విధాలా మేలు జరుగుతుందని అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య అన్నారు. మండల కేంద్రంలోని సర్కిల్ పోలీసు స్టేషన్‌లో సోమవారం ఆయన గూడూరు పోలీసులు పట్టుకున్న అంతర్ జిల్లా దొంగను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామం అభివృద్ధి దిశగా సీసీ కెమెరా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అదే కాకుండా ఏ గ్రామంలోనైనా ఎవరైనా రెండు మూడు రోజులు ఇండ్లకు తాళం వేసి ప్రయాణాలకు వెళ్తే పక్కింటి వారికి చెప్పి వెళ్లాలన్నారు. అవసరమైతే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. నేడు పట్టపగలే చోరీలకు అలవాటు పడిన యువత తాళం వేసి ఉన్న ఇండ్లలో పడుతున్నారన్నారు. రెండు రోజుల క్రితం గూడూరు మండలంలోని బొల్లెపల్లిలోని 5 ఇండ్లలో, అయోధ్యపురంలోని ఒకరి ఇంట్లో, గూడూరులోని 3 ఇండ్లలో జరిగిన చోరీల్లో సమాచారం అందుకున్న 48 గంటల్లోనే పోలీసులు చాకచక్యంగా దొంగను పట్టుకున్నారని తెలిపారు. అతని నుంచి స్వాధీనం చేసుకున్న మొత్తం విలువ రూ. 5,46,200 లు కాగా, అందులో రూ. 30 వేల నగదుతో పాటు మిగతావి బంగారు, వెండి, సెల్‌ఫోన్ వస్తువులను చూపారు. నిందితుడు తొర్రూర్ మండలం సోమారంతండా శివారు తుల్స్యా తండాకు చెందిన బానోతు నవీన్‌గా గుర్తించారు. తొర్రూరు మండలంలో జరిగిన చోరీ కేసులో అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపుతున్నామని తెలిపారు. దొంగను పట్టుకున్న ఇద్దరు ఎస్సైలు, సహకరించిన వారికి ఎస్పీ ఆదేశాల మేరకు నగదుతో పాటు ప్రశంసలు అందించారు. కార్యక్రమంలో డీఎస్పీ డి.రమణబాబు, సీఐ ఎస్కే. యాసిన్, ఎస్సైలు రాణాప్రతాప్, దిలీప్ పాల్గొన్నారు.


నిందితుడు నవీన్

‘ఈస్ట్‌కోస్ట్’లో బాలుర అక్రమ రవాణా

- 10 మంది ఏజెంట్లు, 25 మంది బాలురను అదుపులోకి తీసుకున్న ఆర్పీఎఫ్


బాలురతో బచపన్ బచావో ఆందోళన్ సభ్యులు, సీడబ్ల్యూసీ, ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది

కాశిబుగ్గ : ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో అక్రమంగా తరలిస్తున్న 25 మంది మైనర్ బాలురతో పాటు వారిని రవాణా చేస్తున్న 10 మంది ఏజెంట్లను సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు వరంగల్ రైల్వే పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. షాలిమార్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18045)లో కొంతమంది వ్యక్తులు వెస్ట్‌బెంగాల్, ఒడిస్సా నుంచి హైదరాబాద్‌లో కార్మికులుగా పని చేయించేందుకు పిల్లలను అక్రమ రవాణా చేస్తున్నారు. ఈ క్రమంలో బచపన్ బచావ్ ఆందోళన్ సభ్యులు, సీడబ్ల్యూసీ, వరంగల్, కాజీపేట, డోర్నకల్, ఖమ్మం ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది సంయుక్తంగా ఖమ్మం వెళ్లి ఈస్ట్‌కోస్ట్ ఎక్కి తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో వెస్ట్ బెంగాల్, ఒడిస్సాకు చెందిన 25 మంది మైనర్లను వారిని తరలిస్తున్న 10 మంది ఏజెంట్లను అదుపులోకి తీసుకుని వరంగల్‌లో దిగారు. అనంతరం వారి పూర్తి వివరాలు సేకరించి బాలురను సీడబ్ల్యూసీ హోమ్‌కు తరలించారు. 10 మంది ఏజెంట్లపై బచపన్ బచావో ఆందోళన్ ప్రాజెక్ట్ స్టేట్ కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు జీఆర్పీ పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.ఈ తనిఖీల్లో బచపన్ బచావో సభ్యులు వసుందర, సీడబ్ల్యూసీ చైర్మన్ ఎస్‌కె యాకుబ్‌పాషా, కె.ప్రభ, ఎం.హరీష్, ఆర్.సుమన్, ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు పాల్గొన్నారు.

నేడు జాతీయ మైనార్టీ కమిషన్ మెంబర్ రాక

న్యూశాయంపేట: హనుమకొండ జిల్లాకు జాతీయ మైనార్టీ కమిషన్ మెంబర్ సయ్యదా షెహెజాదీ మంగళవారం రానున్నారు. సుబేదారిలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం అధికారులతో మైనార్టీ సంక్షేమ పథకాలపై సమీక్షంచనున్నారు. అనంతరం ముస్లిం సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ముచ్చటించనున్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి


గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగరం గొర్రెకుంట క్రాస్‌రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో వివాహితకు తీవ్ర గాయాలు కాగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి భర్త, పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని లేబర్‌కాలనీకి చెందిన రిటైర్డ్ ఉద్యోగి కుడికాల సత్యనారాయణ తన భార్య భాగ్యలక్ష్మి(59)ని తన బైక్‌పై ఎక్కించుకుని ఈనెల 6న సాయంత్రం మనవరాలు పెళ్లికి టీఆర్‌టీ కాలనీకి బయలుదేరారు. గొర్రెకుంట క్రాస్‌రోడ్డు నుంచి యూటర్న్ తీసుకుని వరంగల్ వైపు వెళ్లే క్రమంలో నెక్కొండ మండలం చంద్రుగొండకు చెందిన చిలువేరు రాకేశ్ తన బైక్‌పై అతివేగంగా, అజాగ్రత్తగా గొర్రెకుంట వైపు నుంచి వచ్చి వారి బైక్‌ను వెనకనుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో భాగ్యలక్ష్మికి తీవ్రగాయాలు కాగా సత్యనారాయణకు స్వల్ప గాయాలైనాయి. వెంటనే వారిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం భాగ్యలక్ష్మిని హన్మకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు స్థానిక ఎస్సై వెంకన్న తెలిపారు.

నకిలీ కోచ్‌ను ప్రోత్సహిస్తున్న డీవైఎస్‌ఓ


మాట్లాడుతున్న కోచ్ సారంగపాణి

నయీంనగర్: హన్మకొండ డీవైఎస్‌ఓ అశోక్‌కుమార్ నకిలీ కోచ్‌ను ప్రోత్సహిస్తున్నాడని వరంగల్ జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి, కోచ్ వావిలాల సారంగపాణి ఆరోపించారు. సోమవారం హన్మకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తైక్వాండో క్రీడ వ్యవస్థాపకుడిగా 1990లో వరంగల్‌కు తైక్వాండో క్రీడను పరిచయం చేసి కోచింగ్ ఇస్తున్నానన్నారు. తనవద్ద శిక్షణ పొందిన ఎంతో మంది క్రీడాకారులు జాతీయ స్థాయిలో పతకాలు సాధించారన్నారు. తైక్వాండోలో తన నైపుణ్యాన్ని గుర్తించిన అప్పటి శాప్ డీడీ తాను కోచింగ్ ఇవ్వడానికి హన్మకొండ జేఎన్‌ఎస్ ఇండోర్‌లో ఒక రూం అలాట్ చేశారన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు తాను ఉచితంగా శిక్షణ ఇస్తున్నానని తెలిపారు. గత నెల నుంచి హన్మకొండ డీవైఎస్‌ఓ తనని నానా ఇబ్బందులు పెడుతూ వెంకటస్వామి అనే నకిలీ కోచ్‌ను తీసుకొచ్చి తాను శిక్షణ ఇస్తున్న రూంలో శిక్షణ ఇస్తాడని అంటున్నాడన్నారు. క్రీడా సంఘాలకు వారధిగా ఉండాల్సిన ఒలింపిక్ సంఘం ఇలాంటి డీవైఎస్‌ఓను ప్రోత్సహించడం క్రీడలను, క్రీడా సంబంధిత కోచ్‌లను బొంద పెట్టడమే అన్నారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, శాట్ అధికారులు, ఒలింపిక్ అధికారులు, వివిధ అసోసియేషన్లు ఆలోచించి న్యాయం చేయాలని సారంగపాణి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కుమ్మరి రాజశేఖర్, త్యాగరాజు, తిరుపతి, అశోక్, సురేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి


బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న వరదారెడ్డి

హసన్‌పర్తి : వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరుతూ మండలంలోని అన్నాసాగరం శివారులోని సుమతి రెడ్డి మహిళా ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో సోమవారం హెల్మెట్ ధరించి విద్యార్థులు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హన్మకొండ ఏసీపీ కిరణ్‌కుమార్, ట్రాఫిక్ ఏసీపీ మధుసూదన్‌తో కలిసి వరదారెడ్డి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ ప్రాణాలకు రక్షణ కవచంగా పనిచేస్తోందన్నారు. రాంగ్ రూట్, అతివేగం ప్రమాదకరం అన్నారు. హన్మకొండ అంబేడ్కర్ సెంటర్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ఎర్రగట్టుగుట్ట జంక్షన్ వరకు సాగింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజశ్రీరెడ్డి, డాక్టర్ మహేందర్, డాక్టర్ సుదర్శన్, డాక్టర్ వాణిశ్రీ, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

దేశంలో ఉత్తమ రెడ్‌క్రాస్ మనది


సేవా ప్యానెల్ అభ్యర్థుల వివరాలు వెల్లడిస్తున్న విజయ్‌చందర్‌రెడ్డి, ఇతర ప్రతినిధులు

చైర్మన్ డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి

హన్మకొండ అర్బన్: అభివృద్ధిలో రెడ్‌క్రాస్ ముందడుగులో ఉందని, దేశంలోని ఉత్తమ రెడ్‌క్రాస్‌లలో హన్మకొండ రెడ్‌క్రాస్ సొసైటీ ఒకటిగా నిలిచిందని హనుమకొండ జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి అన్నారు. సోమవారం సుబేదారిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గత ఆరేళ్లలో పాలకమండలి సహకారంతో చేసిన అభివృద్ధి వివరించారు. రక్తసేకరణ, తలసీమియా, సికిల్ సెల్ ట్రాన్స్‌ఫ్యూషన్ కేంద్రం, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ క్రింద సాధించిన ప్రగతి, అటు సభ్యత్వంలోనూ, జేఆర్‌సీ, వైఆర్‌సీ ద్వారా సేవాగుణం పిల్లల్లో కల్పించడంలోనూ రెడ్‌క్రాస్ ఎప్పుడు ముందుందన్నారు. దేశ, రాష్ట్ర స్థాయిలో అనేక ఉత్తమ అవార్డులు మన రెడ్‌క్రాస్‌కు వచ్చాయన్నారు. రూ. 1.48 కోట్లతో బ్లడ్ సెంటర్‌ను ఆధునీకరించడం ఒక మైలురాయని పేర్కొన్నారు. అనంతరం ప్యానల్ సభ్యులతో కూడిన ప్రచార పత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈ.వి శ్రీనివాస్ రావు, పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, బొమ్మినేని పాపిరెడ్డి, పెద్ది వెంకట్ నారాయణగౌడ్, జయశ్రీ చెన్నమనేని, వేణుగోపాల్, డాక్టర్ మాగంటి శేషుమాధవ్, రమణారెడ్డి, డాక్టర్ సంధ్యారాణి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలి

- ఐటీడీఏ పీఓ అంకిత్


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ అంకిత్

ఏటూరునాగారం: స్థానిక ఐటీడీఏ పరిధిలోని గిరిజన గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అలాగే పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అంకిత్ అన్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన ఏజెన్సీ ప్రాంతాల్లో డెంగ్యూ, మలేరియా కేసులను డీఎంహెచ్‌ఓను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఎంసీహెచ్ టీంలోని స్టాఫ్‌నర్సుల కొరతపై ఆరా తీశారు. మంగపేట మండలం తిమ్మంపేటలో మాత్రమే కొన్ని కేసులు నమోదయ్యాయని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ క్రాంతికుమార్ తెలిపారు. కేసులు ఇప్పుడు నిలకడగా ఉన్నాయని, లార్వా స్ప్రేయింగ్, ఫాగింగ్, డ్రై డేపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న ప్రాంతాల్లో పారిశుద్ధ్య ఏర్పాట్లకు సంబంధించిన ఎంపీఓలతో సమన్వయం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓను పీఓ ఆదేశించారు.

- మహబూబాబాద్‌లోని యూత్ ట్రెనింగ్ సెంటర్(వైటీసీ)లో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులకు ఎంతమంది అభ్యర్థులు చేరారని, వారికి మౌలిక సదుపాయాలు కల్పించడంపై ఐటీడీఏ జేడీఎంను ప్రశ్నించారు. జెడీఎం మట్లాడుతూ బంకర్ బెడ్‌లు, కంప్యూటర్లు, సీసీ కెమెరాలు, ఆర్‌ఓ వాటర్‌ప్లాంట్ ఇన్‌స్టాలేషన్ పూర్తయిందన్నారు. చేరిన అభ్యర్థులు శిక్షణా కోర్సులకు హాజరవుతున్నారని తెలిపారు. మహబూబాబాద్ జిల్లా ప్రజాప్రతినిధులు, అభ్యర్థులతో ఇంటరాక్ట్ కావడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని జేడీఎంను ఆదేశించారు.
- ఏటూరునాగారంలో కోయ క్రాఫ్ట్‌ల ఏర్పాటుకు 2 నుంచి 4 గుంటల ప్రభుత్వ భూమితోపాటు జీసీసీ పెట్రోల్‌బంక్ ఏర్పాటుకు భూమిని గుర్తించాలని తహసీల్దార్‌ను కోరారు.
- వాటర్‌మెన్ పోస్టుల నియామకానికి సిద్ధంగా ఉన్న పెసా మొబిలైజర్లకు ఉత్తర్వులు జారీ చేయడంపై మిషన్ భగీరథ డీఈఈ సతీష్‌ను ప్రశ్నించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ ప్రక్రియ పురోగతిలో ఉందన్నారు. వేసవిలో ఏదైనా నివాస స్థలంలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పీఓ సూచించారు. వేసవిసెలవుల్లో భారత్ దర్శనం కోసం విద్యార్థుల ఎంపిక ప్రక్రియ ఎంతవరకు వచ్చిందని డీడీ పోచంను ప్రశ్నించగా అర్హులైన వారిని ఎంపిక చేసి జాబితాను పంపామని, ధృవీకరణ తర్వాత విద్యార్థుల జాబితాను ప్రకటిస్తామన్నారు.
- ఏజెన్సీ ప్రాంతాల్లో సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా లేని ఆవాసాలపై ఐటీడీఏ ఏఈ ని విచారించి, నీటిపారుదల బోరుబావుల నిర్వహణకు అవసరమైన త్రీఫేజ్ విద్యుత్ సరఫరా కోసం గుర్తించాలన్నారు.
- ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రధాన పంటలు సాగు నీటిపారుదల వనరులపై అగ్రికల్చర్ ఏఈ శ్రీధర్‌ను విచారించగా వరి, మిర్చి ప్రధాన పంటలు, నీటిపారుదల వనరులు, బోరు బావుల వివరాలను వివరించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో మిల్లెట్స్ యూనిట్ కోసం 100 నుంచి 200 మంది రైతులను గుర్తించాలని వ్యవసాయ శాఖ ఏడీని ఆదేశించారు.
- ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలలో ఎంఎస్‌ఎంఈ, ఈఎస్‌ఎస్ యూనిట్ల మంజూరుపై బ్యాంకర్లు, ఎంపీడీఓలను సమన్వయం చేసుకోవాలని ఏపీఓ వసంతరావుకు సూచించారు. ఐటీడీఏ ప్రాంతాల్లో పీఎంఏజీవై పనుల స్థితిగతులను ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ హేమలతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ తీర్మానాలు ఆమోదం పొందుతున్నాయన్నాయని తెలిపారు. వీడీసీలకు అప్పగించేందుకు సంబంధిత గ్రామ పంచాయతీల నుంచి తీర్మాణాలను సేకరించాలని ఆదేశించారు. కొత్తగా మంజూరు చేసిన బీటీ రోడ్లు, జీపీ భవనాల పనుల పురోగతి, లక్ష్యాలపై ఆరా తీశారు.
- సమ్మర్ సమ్మిట్ క్యాంప్‌లో జరుగుతున్న కార్యకలాపాలు, శిబిరాల్లో ఎంత మంది విద్యార్థులు నమోదయ్యారని ఏసీఎంఓ రవీందర్‌ను ప్రశ్నించారు. ఆకులవారి ఘనపురంలోని ఆశ్రమ పాఠశాలలో ఉదయం యోగా తరగతులు, స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసులు, సాంస్కృతిక కార్యకలాపాలు, సాహిత్యం, క్రాఫ్ట్ కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

విభాగాల వారీగా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై అన్ని యూనిట్ అధికారులు, లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమీక్షించారు. అన్ని ఫిర్యాదులను పరిష్కరించాలని వచ్చే గిరిజన దర్బార్ నాటికి అన్ని పిటిషన్లపై చర్య తీసుకున్న నివేదికతో రావాలని ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

- ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట్ వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన, భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-27024]
- ములుగురోడ్డు కాకతీయ కెనాల్ కన్నేమూల గణపతి టెంపుల్‌కి దగ్గరలో G+1తో గల Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-27028]
- వరంగల్, రంగశాయిపేట, శేషాద్రిహిల్స్‌లో E/F తో గల డీలక్స్ Ready to Occupy 2 BHK House అమ్మకానికి కలదు. సెల్: 7660008666, 8309035091. [WA-27026]

FLAT FOR SALE

- KUDA కాలనీ, 100 ఫీట్ల రోడ్డుకి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంటులో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-27022]

PLOT FOR SALE

- GWMC H.No. 28-5-474/A/1 హన్మకొండ చౌరస్తా నుండి 2KM లోపల తూర్పు ఫేసింగ్ 300 గజాలలో నూతనంగా నిర్మించిన ఒకరూము చుట్టూ కాంపౌండ్ వాల్ మరియు గేట్ నిర్మించి కలర్స్ కూడా వేసినది అమ్మబడును. సెల్: 9885561655. [W-785533]
- లోటస్ కాలనీ, కోమటిపల్లి, భీమారం నందు 400చ.గజాల, North Facing ప్లాటు క్లియర్ టైటిల్‌తో అమ్మకానికి కలదు. నో బ్రోకర్స్. ఫోన్: 9490489083, 9704970783. [HA-10759]

WANTED

- మా చికెన్ సెంటర్‌లో పనిచేయుటకు (2) ఇద్దరు వర్కర్స్ కావలెను. జీ॥ 15000/- + భోజనం + వసతి, ఖాజా & గౌస్ చికెన్ సెంటర్, మార్కెట్ ఏరియా, పర్కాల. సెల్: 9989460198 [W-1110370]
- వరంగల్ లోని చికెన్ సెంటర్‌లో పనిచేయుటకు అనుభవంగల వర్కర్స్ కావలెను. జీతం: 21000+రూం+ భోజనం ఫ్రీ. సెల్: 6281342090, 9949857816 [WA-6963]
- 14,000/- జీతం, 8 గం॥ డ్యూటీ + OT, Qult 8th, ఫ్రీ రూం, తక్కువ రేటుకు భోజనం, యూనిఫాం ఫ్రీ. సెక్యూరిటీ గార్డ్స్ కోదాడ దగ్గర చేయుటకు కావలెను. © 86884 17132, 63008 79854, 93469 73791 [B-997]
- లేపాక్షి హెల్త్‌కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను ఫ్రీ వసతి+భోజనం. జీ: 18K ఏజెంట్ కమీషన్ 6K. ఫోన్: 9640400073. [HA-148]
- ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684 [G-786224]

WANTED TEACHERS

- Wanted qualified teachers and PET's for (Nur to VII all subjects) Contact: 7416744459, 741644469. [W-1002199]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥లు మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ 9010144453
వరంగల్ 9705748198
నర్సంపేట 9010144453
జనగామ 9951602871
మహబూబాబాద్ 9010144453
జయశంకర్ భూపాలపల్లి 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.